క్లుప్తంగా

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలి

బూర్గంపాడు: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుకార్చే కుట్రలకు పాల్పడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపుల్లో కోత విధించి కూలీల పొట్టకొడుతుందన్నారు. ఈ పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలు ఐక్యంగా పోరాడాలన్నారు.

వాటర్ ప్లాంట్ వితరణ



ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న హెచ్‌ఎం, నాయకులు, గ్రామ పెద్దలు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మినీ వాటర్ ప్లాంట్‌ను కోటగిరి బుజ్జి వెంకటరావు, రమాదేవి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కోటగిరి సీతారామయ్య, కిషోర్‌లు వితరణగా అందజేశారు. రూ.లక్షా 50 వేల విలువ గల ఈ వాటర్ ప్లాంట్‌ను శనివారం వారు గ్రామ పెద్దలతో కలసి ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం కీసర లక్ష్మి, గ్రామ పెద్దలు దాతలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావు, శ్రీరాముల చక్రధరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, కూరం అర్జున్, కోటగిరి రామకృష్ణ, మెచ్చు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మణుగూరురూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా స్థానిక ఎక్సలెంట్ పాఠశాలలో శనివారం క్రీడా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ సతీష్‌కుమార్, ఎస్సై మేడ ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం క్రీడల్లో ప్రతిభను కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సీఐ సతీష్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్, సీఈఓ, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ప్రైమరీ ప్రిన్సిపల్స్ సమియయ్యర్, సమీన, జేనత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ హెచ్‌ఎంకు సన్మానం

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక ఎంపీపీఎస్ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం మోతుకూరి సావిత్రి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఓపెన్ టాప్ జీపులో సావిత్రిని మేళతాళాలతో ఊరేగింపుగా పాఠశాల వరకు తీసుకునివచ్చి, సభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. 36 సంవత్సరాల ఉపధ్యాయ వృత్తిలో సావిత్రి సేవలను అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఏవీ రామారావు, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజీ.ప్రభాకర్, గ్రామపెద్దలు కొర్సా చిలకమ్మ, చిన్నయ్య, ఉబ్బా వేణు, శివ, బాలకృష్ణ, నాగమణి, యూనియన్ నాయకులు శ్రీనివాస్, రత్నాకర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర

భద్రాచలంటౌన్: డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను శనివారం పాత మార్కెట్ మహాత్మ గాంధీ సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహ వద్ద రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యలు మాట్లాడుతూ.. ఇటీవల పరిమాణాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ సెక్రటరీ ప్రమోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పువ్వాడ జన్మదిన వేడుకలు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలో మాజీ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రాత్రి మాజీ మంత్రి పువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. బాణసంచా కాల్చి, పెద్ద కేకును కట్ చేశారు. వేడుకలకు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు హాజరు కాగా.. తాజా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఆయన ప్రధాన అనుచరగణం హాజరు కాలేదు. నాయకులు వగ్గెల పూజ, తూతా నాగమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.



బాబుకి 7 నెలలు వచ్చిన సందర్భంగా టపాసులతో అలంకరణ..



ఆడ శిశువు చేతులు, పాద ముద్రలు ఇలా..



100 రోజుల సందర్భంగా కేక్‌తో శుభాకాంక్షలు..

నెలనెలా.. చిన్నారికి వెన్నెల!

ప్రతీ మాసంలో పిల్లలకు వేడుక

- చిరకాలం గుర్తుండేలా సంబరాలు
- ఖర్చయినా.. తగ్గేదేలె!
- ఏజెన్సీ గ్రామాలకూ విస్తరిస్తున్న సంస్కృతి

చిన్నారులకు చేసే శుభ కార్యక్రమాలు ఆ ఇంట ఆనందాలు తెస్తాయి. తొలిసారి ఊయల, నామకరణం, కేశ ఖండన మహోత్సవాలు తల్లిదండ్రులకు తీపి జ్ఞాపకాలు. ఇక వీటికి అదనంగా నెలకో పుట్టిన రోజు వేడుక ట్రెండింగ్‌లో ఉంది. ఈ సంస్కృతి ఇప్పుడు నగరాల నుంచి గ్రామాలకూ విస్తరించింది. దీంతో కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు ఈ వేడుకలను చిరకాలం గుర్తుండేలా నెలనెలా నిర్వహిస్తున్నారు.

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: కుటుంబంలోకి నూతనంగా వచ్చిన శిశువు పుట్టిన తేదీన ఏడాదిపాటు సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శిశువు వయసు ప్రకారం పుట్టి ఒక నెల పూర్తయితే మొదటి నెంబరుతో అలా 12 నెలల వరకు ప్రతీనెల జన్మదిన వేడుకలను చేపడుతున్నారు. వేడుక నిర్వహించే గదిని అందంగా అలంకరిస్తున్నారు. బేబీ బర్త్ డే షూట్ చేయిస్తున్నారు. వీటి కోసం ఎంత ఖర్చయినా వెనకాడటం లేదు.

వైవిధ్యంగా.. వినూత్నంగా..

నెలనెలా వేడుకలు వైవిధ్యంగా, వినూత్నంగా ఉండేలా వస్తువులు, ఎలక్ట్రానిక్ సామగ్రి, పండ్లు, కూరగాయలు, చాక్లెట్లు, దేవుడి బొమ్మలతో అలంకరిస్తున్నారు. కలెక్టర్, పోలీస్, డాక్టర్, లాయర్, టీచర్, ఇంజినీర్, మెకానిక్, రైతు ఇలా భిన్న వృత్తులు చేసే వారి దుస్తులను శిశువు చుట్టూ అలంకరిస్తున్నారు. వాటిని ఈవెంట్ మేనేజర్లతో, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లతో ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. వాటిని తీపి గుర్తులుగా తల్లిదండ్రులు భద్రపరుచుకుంటున్నారు.

సెట్టింగ్‌లు సైతం..

వేడుకల్లో భాగంగా జిల్లాతో పాటు భద్రాచలం, సారపాకలో స్టూడియోలు, విభిన్న రకాల డిజైన్లతో ఫొటో స్టూడియోలలోనే సెట్టింగులుగా ఏర్పాటు చేస్తున్నారు. తల్లిదండ్రుల అభిరుచులకు తగ్గట్టు అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామని స్టూడియో నిర్వాహకుడు పేర్కొంటున్నారు.

మహాలక్ష్మికి స్వాగతం..

దంపతులకు ఆడ శిశువు జన్మిస్తే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందంటూ వివిధ రూపాల్లో సంబురాలు చేస్తున్నారు. ఇంటి గుమ్మం నుంచి మొదలుకుని లోపల వచ్చేవరకు వచ్చేవరకు పాపతో ప్రత్యేక పాద ముద్రలు వేయిస్తున్నారు. కుంకుమ రంగు నీటితో రెండు చేతులు అచ్చులు వేసి మురిసిపోతున్నారు. ఇదిలా ఉండగా రెండో కాన్పులో ఆడ శిశువు జన్మించినా ఆదే రీతిలో స్వాగతం పలుకుతున్నారు.



పాప జన్మించి 6వ నెలలోకి అడుగుపెడుతున్నప్పటి ఫొటో..

అన్నదానాలు నిర్వహిస్తూ..

11 నెలల సంబరాల అనంతరం చిన్నారుల పుట్టిన రోజు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు అనాథాశ్రమాల్లో, వృద్ధాశ్రమాల్లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నారు. అన్నదానాలు చేసి పండుటాకుల నుంచి దీవెనలు అందుకుంటున్నారు.

ఆల్బమ్ బహుమతిగా ఇస్తాం..



పాప మహితశ్రీకి ప్రతి నెలా వేడుకలు జరుపుకున్నాం. పాప ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్న ఫొటోలు చూసి మాలో ఎంతో ఆత్మవిశ్వాసం కలిగింది. ఆల్బమ్ తయారుచేసి పాప పెద్దయ్యాక బహుమతిగా ఇస్తాం.

– సుధాకర్ రెడ్డి–శాంతి దంపతులు, రెడ్డిపాలెం, బూర్గంపాడు మండలం

ప్రతీ నెల నిర్వహించాం..



బాబు పేరు త్రినయ్ సింహ. గత నెల మార్చి 18కి ఏడాది. బాబు పుట్టిన తేదీ నుంచి ఇప్పటి వరకు నెలకో పుట్టినరోజు నిర్వహించాం. ఫొటోలు, వీడియోలు తీసి భద్రపరుస్తున్నాం. ప్రతిదీ ఓ మధుర జ్ఞాపకంగా దాచిపెడుతున్నాం.

– కుప్పాల శరణ్‌తేజ–మనీషా దంపతులు, భద్రాచలం

అంగన్‌వాడీల్లో పోషణ్ పక్వాడా

అశ్వాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బలమైన పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ రేవతి అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు సెక్టార్ పరిధిలోని తుమ్మలచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ స్థాయిలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని కొమ్ముగూడెం రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ హేమ సత్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారాన్ని వివరించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు చేశారు. ఏసీడీపీఓ సీతారాములు, ప్రాజెక్ట్ పోషణ కో–ఆర్డినేటర్ వీరేంద్ర, ఏఎస్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి: సామూహిక సీమంతాలు..

రేపు 'భూ భారతి'పై అవగాహన

మణుగూరుటౌన్: మండలంలోని ప్రజలకు, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం–2025పై కిన్నెర కల్యాణ మండపంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరవుతారని, ప్రజలు, రైతులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

25న 'సీతారామ'పై సదస్సు

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్‌పై ఈనెల 25వ తేదీన కొత్తగూడెంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య తెలిపారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, పోడియం వెంకేశ్వర్లు, మాలోతు రావూజా, నిమ్మల మధు, లక్ష్మీనర్సయ్య, భైరు ప్రసాద్, మంచాల సారయ్య, అమల, సోయం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గుంపెన సొసైటీ చైర్మెన్ బోయినపల్లి సుధాకర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, నాయకులు కొటగిరి వరప్రసాదరావు, వేములు రమణ, సున్నా బసవయ్య, షేఖ్ గఫార్, ఎస్‌కె.రహీం, రైతులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహించాలి

మణుగూరుటౌన్: డీగ్రేడ్ అర్హత పొంది రెండేళ్లు గడిచిన ఈపీ ఆపరేటర్లకు సీ గ్రేడ్ పదోన్నతి ప్రతిభ పరీక్ష నిర్వహించాలని ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్‌కు టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు శనివారం వినతిపత్రం అందజేశారు. అక్టోబర్ మాసంలో నిర్వహించాల్సిన పరీక్ష నేటి వరకు నిర్వహించకపోవడం వల్ల యువ ఆపరేటర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని నాయకులు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్, మస్తాన్, ముకేశ్, మునిగెల నాగేశ్వరరావు, రాము, ఇమ్రాన్, కల్యాణ్, శ్రీనివాస్ ఉన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన నోటు పుస్తకాలను ఎంఈఓ సత్యనారాయణ హెచ్‌ఎంలకు అందజేశారు. శనివారం ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు. 2,3,4 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులకు వీటిని వేసవి సెలవల్లో చేతిరాత నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

స్థానికుల ప్రాణాలు పట్టవా?

మణుగూరుటౌన్: సింగరేణి కార్యకలాపాల మూలంగా ప్రభావితమౌతున్న తిర్లాపురం, విటల్ రావ్‌నగర్, రాజుపేట గ్రామాలను సింగరేణి స్వాధీనం చేసుకుని పరిహారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా పెట్టిన మార్కింగ్ విఠల్‌రావునగర్‌కి కేవలం 25–30 మీటర్ల దూరం మాత్రమే ఉందని, బ్లాస్టింగ్ వల్ల ఇక్కడి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తిర్లాపురం, రాజుపేట తదితర గ్రామాలూ ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్యకలాపాల మూలంగా ప్రాణ, అనారోగ్య ముప్పు ఉన్న ఈ గ్రామాలను సింగరేణి తీసుకుని, ఇక్కడి ప్రజలకు పరిహారం అందించడంతోపాటు సురక్షిత ప్రాంతాలను తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సరెడ్డిపుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సర్వర్, జంగం మోహన్‌రావు, గోపిశెట్టి శివయ్య తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

జేఈఈలో మెరిసిన గురుకుల విద్యార్థులు



గుండాల: విజేతలను అభినందిస్తున్న గురుకుల కళాశాల అధ్యాపకులు



ఎండీ సన తబస్సుమ్ | మోతుకూరి శ్రీ తేజ | శ్రీ తేజ

గుండాల: జేఈఈ మెయిన్స్ 2025లో గుండాల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. డి.నరసింహ78.82%, ఎన్.దేవిప్రసాద్ 72.46% బి.పాషా నాయక్ 60.69%, జి.మనోహర్ 58.53%, బి.సతీష్ కుమార్ 57.74%, ఎల్.అనిల్ 55.36%, జి.గణేష్ 49% సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ విప్పా సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపల్ సురేష్, వైస్ ప్రిన్సిపల్ ఏ.రామచంద్రరావు జోష్, కళాశాల అధ్యాపక, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

'లిటిల్ ఫ్లవర్స్' విద్యార్థులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచారు. కళాశాల విద్యార్థులు ఎండి.సన తబస్సుమ్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 27,851 ర్యాంక్ సాధించి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. మోతుకూరి శ్రీ తేజ 35,828, జాహ్నవి ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 44,598 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల ఆవరణలో జరిగిన అభినందన సభలో విద్యా సంస్థల డైరెక్టర్ మాగంటి శ్రీనివాస వర ప్రసాద్ బాబు, కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు విద్యార్థులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు ఎండి.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

'బ్రిలియంట్' విద్యార్థిని..

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థలో చదువుతున్న బి.సంయుక్త జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయిలో 7940వ ర్యాంకు సాధించింది. ఆమెను శనివారం బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు జ్ఞాపిక అందించి అభినందించారు. అధ్యాపకులు, స్థానికులూ సంయుక్తను అభినందించారు.

21లోపు తుది జాబితా రూపొందించాలి

ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యే జారే సూచన

దమ్మపేట: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తయారు చేశారని, దీనిని ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలించి, ఈ నెల 21లోపు తుది జాబితాను రూపొందించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా విధివిధానాలపై ఎమ్మెల్యే జారే ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు రూపొందించిన జాబితాను ఈ నెల 22 నుంచి 30 వరకు అధికారులు మరల పరిశీలించి, మార్పులు ఉంటే సరిచేస్తారని, చివరగా మే నెల 2న తుది లబ్ధిదారుల జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. కాగా ఇదే సమావేశంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. గత జనవరి నెలలో లబ్ధిదారుల కోసం జరిగిన సర్వే తప్పుల తడకగా ఉందని అన్నారు. కొంతమంది దళారులు ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సారైనా అర్హత ప్రమాణాలను పాటించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన



శాంతినగర్ చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూటౌన్: మున్సిపాలిటీలోని శివలింగాపురంలో రూ.3 కోట్లతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, మండల నాయకులు నవీన్, శివ సైదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు, వర్షాకాలంలో అలుగుపారుతూ పంటల నష్టానికి కారణమౌతున్న అత్యంత పురాతన శాంతినగర్ ఊరచెరువును పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు మ్యాప్‌ను అధ్యయనం చేశారు. అధికారులతో నివేదిక తెప్పించుకుని శాశ్వత పరిష్కారం చేస్తానని భరోసానిచ్చారు. పగిడేరు మాజీ సర్పంచ్ కుంజా భిక్షం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

బూర్గంపహాడ్ మండలానికి చెందిన 34 మందికి 12.45లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు అందజేశారు.

రేగులగండిలో ఉచిత వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రేగులగండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మణుగూరు మండల లీగల్ సర్వీసెస్, ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ కంబపు సూరిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, డాక్టర్ మార్తి సాయిమోహన్, గైనకాలజిస్ట్ అజంత, నేత్ర వైద్యాధికారి సంజీవరావులు వివిధ రుగ్మతలతో బాధపడుతున్న గ్రామస్తులకు, చిన్నారులకు, మహిళలకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. గిరిజన గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తులకు మెజిస్ట్రేట్ చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిర్రా రవికుమార్, న్యాయవాదులు సర్వేశ్వరరావు, పోశం భాస్కర్, పద్మావతి, చిర్రా సరస్వతి, నగేష్‌కుమార్, జి వెంకటరత్నం, రమేష్, గురుకృష్ణ, ఆర్ ఎంపీ సుభాని, కోర్ట్ సిబ్బంది, వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

ప్రైవేటు స్థలంలో విగ్రహ ఏర్పాటుకు యత్నం



సమావేశంలో మాట్లాడుతున్న జర్పుల నాగమ్మ, కుటుంబ సభ్యులు

బూర్గంపాడు: తమ సొంత ఇంటి స్థలంలో కొందరు నాయకులు విగ్రహం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, నిరాకరించడంతో బెదిరిస్తున్నారని సారపాక గాంధీనగర్‌కు చెందిన జర్పుల నాగమ్మ అనే గిరిజన మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో శనివారం తన కుటుంబసభ్యులతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సారపాక గాంధీనగర్‌లో తాను కొనుగోలు చేసి, కరెంట్ మీటర్, నీటి కుళాయి ఏర్పాటు చేసుకున్న సొంత ఇంటి స్థలంలో.. కొందరు గిరిజనేతరులు అంబేడ్కర్ విగ్రహం పెట్టేందుకు యత్నిస్తున్నట్లు, అర్ధరాత్రి విగ్రమాన్ని తన ఇంట్లో పెట్టి రెండుసెంట్లు స్థలం ఇవ్వాలని దాడికి, బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపింది. బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. సమావేశంలో జర్పుల రాము, రాంబాబు, చిరంజీవి, సురేష్, శంకర్, ఏసు, విక్రమ్, గణేష్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలకు గాయాలయ్యాయి. మల్లెలమడుగు గ్రామానికి చెందిన కమటం వెంకన్న, వెలమ వసంత ఇద్దరు ఉపాధి హామీ పనులకు వెళ్లి టీవీఎస్‌పై వస్తూ మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి మల్లెలమడుగు వచ్చే రహదారికి రోడ్డు క్రాస్ అవుతుండగా కొత్తగూడెం వైపు వెళ్లే కారు టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఇద్దరిని స్థానికులు భద్రాచలంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వసంతకు స్వల్ప గాయాలు కాగా.. వెంకన్నకు పక్కటెముకలు నాలుగు క్రాక్ వచ్చాయని వైద్యులు చెప్పినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం


మణుగూరురూరల్: ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మహిళా నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టు పెట్టి సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాకాల రమాదేవి, తుంగల చంద్రకళ, గంగారపు సరిత, ఉపేంద్ర, జ్యోత్స్న, సుజాత, సుహాసిని, బీరమ్మ, సరోజిని, లక్ష్మి, హేమ, సుజనా, సుప్రియ, రెడ్డమ్మ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

చంద్రుగొండ: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంచరణ్ కోరారు. ఈ మేరకు సభల వాల్‌పోస్టర్లను శనివారం ఆయన అవిష్కరించారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మంలో జరిగే సభల్లో విద్యారంగంపై పాలకులు అవలంబిస్తున్న విధానలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల బాధ్యులు పెరుమాళ్ళ పవన్‌కుమార్, షానూన్, రుత్విక, రాధిక, పూర్ణిమ, జ్యోష్నశ్రీ పాల్గొన్నారు.

వక్ఫ్‌లో జోక్యం.. మత స్వేచ్ఛకు విఘాతం

కరకగూడెం: వక్ఫ్ ఆస్తుల్లో కేంద్ర ప్రభుత్వ జోక్యం చేసుకోవడం మతపరమైన స్వేచ్ఛకు విఘాతమని మండల ముస్లిం మైనార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన కొన్ని సవరణలను వ్యతిరేకిస్తూ శనివారం కరకగూడెం జామా మస్జీద్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన తెలిపారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని కాపాడుతూ రాజ్యాంగ హక్కులను గౌరవించి మైనారిటీల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డీటీ వట్టం కాంతయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, షేక్ సొందు పాషా, సయ్యద్ సజ్జాద్ హుస్సేన్, పఠాన్ యాకుబ్ ఖాన్, అక్బర్ ఖాన్, రఫీ, ఖలీల్, ఆరిఫ్, షేక్ యాకుబ్, గయాస్, సయ్యద్ అన్వర్, షేక్ అజ్జు, అబ్దుల్లా, ఇలియాజ్, రియాజ్, ఎండి.ఖయ్యూమ్, ముస్లిం గురువులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పినపాక: వక్ఫ్ బోర్డ్ చట్టం 2025ను రద్దు చేయాలని ముస్లిం మత పెద్దలు, సంఘాలు కోరారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని మసీదు దగ్గర నుంచ తహసిల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. తహల్దార్ అద్దంకి నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండి.సలీం, ఎస్‌కె.మీరా సాహెబ్, లాల్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.